ప్లాస్టిక్ పువ్వులు

—ఎస్. జయ

ప్రియమైన అమ్మకు—

ప్రమోషన్ వచ్చి బాధ్యతల్నీ, పనుల్నీ పెంచింది. ప్రమోషన్లు మనిషి సుఖాన్ని చంపుతాయని నువ్వన్నమాటలు ఈ మధ్య పదేపదే గుర్తొస్తున్నాయి. నేను ఈ ప్రమోషన్ కోసం ఏప్రయత్నం చేయలేదు. దానికదే వచ్చినప్పుడు ఆ పనిని నిర్వహించడం తప్పనిసరికదా!

ఈ విషయంలో నువ్వు నాతో ఏకీభవిస్తావని తెలుసు. పనుల వత్తిడితో వర్షను చూసుకోలేకపోతున్నాను. నువ్వు వస్తే బాగుంటుంది. వర్ష చెప్పినట్లు వింటుంది. మారాం చేయదు. నీకిష్టమైన బుక్స్ చదువుకోవడానికి టైమూ వుంటుంది. నీకు ఏ ఇబ్బంది వుండదు. వీలైనంత త్వరగా రాగలవు.

—ప్రేమతో
—శిరీష.

కూతురి ఉత్తరం చదువుకొని విజయ ఆశ్చర్యపోయింది. పాపను చూసుకోవడానికి రమ్మని రాసింది. శిరీషలో ఈ మార్పు ఎందుకొచ్చింది? కారణాలు ఏమై వుంటాయి అనుకుంది. శిరీష ఉత్తరం ఆశ్చర్యం కలిగించినప్పటికీ, చాలా ఆనందపడింది విజయ. పాప పుట్టినప్పుడు రెండువెలలు శిరీషకు తోడుగా వుండివచ్చింది. అప్పుడు తనే అడిగింది పాపను చూసుకుంటాను వుండిపోనా అని...

'వద్దమ్మా, నీ టైం అంతా పాపను చూసుకోవడానికే అయిపోతుంది. ఈ మధ్యనే రిటైర్డ్ అయ్యావు. నీకిష్టమైనవి చదువుకో, రాసుకో, పాపను క్రేష్‌కు పంపుతాను. పిల్లల్ని పెంచే బాధ్యత అమ్మమ్మలకే ఎందుకుండాలి, వాళ్ళకు విశ్రాంతి వద్దా' అని వాదించిన శిరీష ఇప్పుడు నాలుగేళ్ళ వర్షను చూసుకోవడానికి రమ్మని రాయడం నమ్మలేకపోతోంది.

శిరీష బ్యాంకుల్లో మేనేజర్. ఆమె భర్త మోహన్‌రావుకు లాయర్‌గా మంచి పేరుంది. మంచిపేరు వుందంటే మంచి సంపాదన వుంది. ఇంట్లో ఇద్దరు పని మనుషులు. ఒకరు వంటకు, మరొకరు మిగిలిన పనులు చేయడానికి. మోహన్‌రావు దగ్గర పనిచేసే అటెండర్ ఇంటి సరకులన్నీ తెచ్చిపెడతాడు.

పాపను చూసుకోవడానికి ఇంకో పని మనిషిని కూడా పెట్టుకోగలదు శిరీష. అయినా అమ్మకోసం ఉత్తరం రాసింది. పాప పుట్టిన వార్త తెలిసి విజయ ఎంత సంతోషించిందో పాపను చూసుకోవడానికి రమ్మని శిరీష వ్రాసిన ఉత్తరానికి అంతే సంతోషపడింది. వర్షకు ఎన్నెన్ని కథలు చెప్పవచ్చో, ఎట్లాంటి ఆటలు ఆడుకోవచ్చో కలలు కనింది. తనకే బాల్యం వచ్చినట్లు ఆనందించింది.

బాల్యం నిజంగా ఎంత గొప్పది. బాల్యాన్ని తిరిగి తిరిగి జీవించాలని అందరూ కలలు కంటారు. అమ్మమ్మలు మాత్రమే బాల్యాన్ని ముద్దాడి, మురిసిపోతూ మళ్ళీ మళ్ళీ బాల్యాన్ని జీవిస్తారు. కొంచెం ఆలస్యం అయిందిగానీ, ఇప్పటికైనా మించిపోయిందిలేదు. వర్షను చూసుకోవడానికి వెళుతున్నాను అని సంబరపడింది విజయ.

విజయ టీచర్‌గా ఆఊరు, ఈఊరు తిరుగుతూ పిల్లల్ని చూసుకోలేక, తన ఇద్దరు పిల్లల్ని పదేళ్ళు వచ్చే వరకు తన అమ్మదగ్గర పల్లెటూళ్ళోనే పెట్టింది.

శిరీషకు ఆరేళ్ళప్పుడు వేసవి సెలవులకు తెచ్చుకుంటే, 'అమ్మా, నీకన్నా అమ్మమ్మే బాగా చూసుకుంటుంది. ఏది కావాలన్నా [illegible] ఎన్నెన్ని కథలు చెబుతుందో చందమామను చూపిస్తూ, అందుకేనా నన్ను అమ్మమ్మ దగ్గర వుంచావు? మరే....నేను పెద్దయ్యాక, నాకు పాప వుడితే....ఆపాపను నువ్వు పెంచుతావా ఇప్పుడు నన్ను అమ్మమ్మ పెంచినట్లు?" అడిగింది శిరీష.

విజయ కూతురిని గుండెలకు హత్తుకొని నవ్వుతూ 'తప్పకుండా' అంది.

ఆ మాటలన్నీ గుర్తొచ్చి నవ్వుకుంది విజయ.

పెద్దకూతురు విమల కాలేజీ నుంచి రాగానే శిరీష నుంచి వచ్చిన ఉత్తరం చూపించింది. విమల కూడా ఆశ్చర్యపోయింది. "శిరీష మనసు ఎందుకు మార్చుకున్నా మంచిదేకదమ్మా, ఆదివారం వస్తున్నానని ఈ రాత్రే ఫోన్ చేయి. నీ ప్రయాణానికి అన్నీ సర్దుతాను" అంది.

"లగేజీ ఎక్కువ లేకుండా చూడు విమలా, ఏమి కావాలన్నా అక్కడ తీసుకోవచ్చు"

విమల, ఆమె భర్త రాజేశ్వర్ నంద్యాల్లో గవర్నమెంటు డిగ్రీ కాలేజీలో లెక్చరర్లు. అది పల్లెటూరు కాదూ, అట్లాఅని పట్నం కాదు. పట్నం హంగులూ, పల్లెటూరి వాసనలు, రుచులు ఆఇంట్లో కలగలిసి కనిపిస్తాయి.

విజయను హైదరాబాద్ బస్ ఎక్కిస్తూ రాజేశ్వర్ ఓ మామిడిపళ్ళ బుట్ట తీసుకొచ్చి సీటుక్రింద సర్దాడు. అది చూసి విజయ "ఇవన్నీ సిటీలో దొరకవనా తెచ్చావు" అంది.

"చెట్టుమీద మాగిన పండ్లు ఇవి. ఇంత పండ్లు అక్కడ దొరకవు. సిటీలో మామిడికాయలపై ఏవేవో పౌడర్లుచల్లి రంగు వచ్చేట్లు చేసి అమ్ముతారు" అన్నాడు తనే చెట్టెక్కి పండ్లుకోసి తెచ్చినట్లుగా.

'లగేజీ వుండొద్దని విమలకు చెప్పాను. నువ్వేమో ఇంత లగేజీ పెడుతున్నావ్" విజయ

"మీకోసం బస్టాండ్‌కు కారు పంపుతుంది శిరీష. ఈ పండ్ల బుట్టను బస్‌లోంచి ఎవరూ మధ్యలో దించుకోకుండా చూడ్డమే మీ పని. మామిడిపండ్లు వాటికవే రవాణా అయిపోతాయి"

ఎప్పుడు ప్రయాణాలు చేసినా, ఆయా సీజన్‌లో దొరికే పండ్లబుట్టలు తేవడం, ఏమన్నా అంటే, మీరేమీ మోయక్కర్లేదు ఆటోలో, బస్సులో, కార్లో మోస్తాయి అనడం రాజేశ్వర్‌కు రివాజు. "పాఠం మరీ పాతదిసార్!! ' విజయ రాజేశ్వర్‌రావువైపు ఆప్యాయంగా చూసింది.

"పంతులమ్మకు పాఠాలు చెప్పబోయాను. క్షమించండి, ఏదో పల్లెటూరి బైతును" విజయ, రాజేశ్వర్ హాయిగా నవ్వుకున్నారు. అదే సమయంలో బస్సు కదిలింది.

విజయ వెంట వచ్చిన పండ్లబుట్టను చూసి శిరీష, మోహన్‌రావు కూడా "మామిడిపండ్లు ఇక్కడ వున్నాయి కదా, ఎందుకీశ్రమ" అన్నారు.

"నేను వద్దంటున్నా రాజేశ్వర్ పంపాడు" "మాకు పల్లెటూరి రుచులు చూపించాలని పంపాడన్నమాట" అన్నాడు మోహన్‌రావు. పల్లెటూరి అమాయకుడు రాజేశ్వర్ ప్రయోజకుడు కాలేదని అతని భావం.

వర్ష పండ్లవాసన పీల్చుకోవడం చూసి నవ్వింది విజయ.

'భలేవాసన! ఏమిటీ అమ్మమ్మ" అడిగింది వర్ష.

"మామిడిపండు కోసి ముక్కలు ఇచ్చింది విజయ.

"పీసెస్ వద్దు, జూస్ తాగుతాను" వర్ష.

"ఇట్లా తింటేనే బాగుంటుంది. కొన్ని ముక్కలు తిను"

"మాంగోనా...ఇది...ఫ్రూటీలాగా వుందే..!

"ఫ్రూటీని మాంగోతోనే చేసేది" విజయ.

ఫ్రూటీ జూస్ కన్నా మాంగో జూస్ బాగుంది అనుకుంటూ పండు తినేసింది.

మర్నాడు సోమవారం స్కూలు నుంచి రాగానే మాంగో కావాలని అమ్మమ్మని అడిగింది వర్ష

"స్నానం చేసి, డ్రెస్ వేసుకున్నాక" అంటూ వర్షను బాత్‌రూంలోకి తీసుకు వెళ్లింది. డ్రెస్ తీసేసింది. మెళ్ళో గొలుసుకు లాకెట్ గడియారం వేలాడుతోంది. గొలుసు తీయబోయింది విజయ. "వుండాలి అమ్మమ్మా, ఎప్పుడు తీయను" అంది. వర్షకు స్నానం చేయించి, డ్రెస్ వేసింది. మామిడిపండు కోసి ముక్కలు ప్లేట్‌లో పెట్టి ఇచ్చింది. వర్ష కొన్ని ముక్కలుతినేసరికి వర్ష మెడలో వున్న లాకెట్ గడియారం కీచ్‌మని మోగింది. ప్లేట్‌లో పండును అలాగే వదిలేసి గబగబాలోనికి వెళ్లింది వర్ష. బుక్స్ బ్యాగ్ తెరిచి హోంవర్క్ చేసుకోవడం మొదలుపెట్టింది. తింటున్న పండు వదిలేసి, హోంవర్క్ చేసుకుంటున్న వర్షను చూసి విస్తుపోయింది విజయ. ప్లేట్లో మిగిలిన పండ్ల ముక్కలు తీసి గిన్నెలో వేసి మూతపెట్టి, ఫ్రిజ్‌లో పెట్టింది.

'ఏం రాస్తున్నావ్ వర్షా?' మధ్యలో పలకరించింది విజయ.

'హోంవర్క్ చేసుకుంటున్నాను' తల ఎత్తకుండానే జవాబిచ్చింది.

వర్షకు కొద్దిదూరంలో కూర్చుని గమనించింది విజయ.

మరో గంటకు లాకెట్ గడియారం 'కీచ్'మని మోగింది.

బుక్స్ అన్నీ గబగబా బ్యాగ్‌లో సర్దేసింది వర్ష.

"హోంవర్క్ అయిపోయిందా?" విజయ అడిగింది.

"అయిపోయింది, ఆడుకుంటాను"

విజయముఖం సంతోషంతో విప్పారింది. తన గదిలోంచి ఒక బ్యాగ్ తెచ్చి వర్ష ముందు పోసింది. "మరే...నీకోసం విమల ఆంటీ ఈ బొమ్మలు, చాక్లెట్స్ ఇచ్చింది' అని చూపింది. అన్నీ చూసి, పెన్సిల్స్, ఎరేసర్స్, షార్ప్‌నర్స్ ఏవీ" అడిగింది వర్ష

"వాటితో ఆడుకోలేవు కదా"

"హోంవర్క్ చేసుకుంటాను. చూడు, నా దగ్గర టూ డజన్స్ పెన్సిల్స్, ట్వంటీ ఎరేసర్స్, ఒక డజన్ షార్ప్‌నర్స్ వున్నాయి. ఇంకా బోలెడన్ని కావాలి. మా ఫ్రెండ్స్‌కు ఫోర్ డజన్స్ పెన్సిల్స్, త్రీ డజన్స్ ఎరేజర్స్, టూ డజన్స్ షార్ప్‌నర్స్ వుంటాయి. నాకే తక్కువ వున్నాయి. నేను పూర్" అంది చేతులు అటూ, ఇటూ ఆడిస్తూ.

అప్పుడు గమనించింది విజయ వర్ష వేళ్ళను. అవి పెన్సిల్ చెక్కి, రాసినదాన్ని రబ్బర్‌తో తుడుస్తూ లేతగులాబి రంగులో వుండాల్సిన వేళ్ళ చివర్లు నల్లగా మసిబారివున్నాయి. ఈలోగా మళ్ళీ గడియారం 'కీచ్' మంది.

ఈసారి వర్ష ఏంచేస్తుందోనని బిత్తరపోయి చూసింది విజయ. వర్ష పెన్సిళ్ళన్నీ ముందేసుకుని షార్ప్‌నర్‌తో చెక్కి మళ్ళీ బాక్స్‌లో నీట్‌గా సర్ది, చేతులు కడుక్కొంది. బ్యాగ్‌లో వున్న బుక్స్ అన్నీ తీసి, మరుసటిరోజుకు టైంటేబుల్ ప్రకారం మళ్ళీ బ్యాగ్‌లో సర్దింది. దాన్ని ప్రక్కన పెట్టుకొని సైన్స్‌బుక్ తీసి చదవడం మొదలుపెట్టింది. ఈలోగా అటెండర్ రెండు మూడుసార్లు లోపలికి తొంగిచూసి, మళ్ళీ ఆఫీసురూంలోకి వెళ్ళాడు. అట్లా అతను మూడోసారి చూసినప్పుడు విజయ అతన్ని ఆపింది. ఏమన్నా కావాలా అని అడిగింది.

లేదని చెప్పాడు.

అతన్ని కూర్చోమని చెప్పి లోపలికి వెళ్లి రెండు టీ లు తెచ్చింది. ఒకటి అతనికి ఇచ్చి, మరొకటి తను తీసుకొని అతని వివరాలు అడిగింది. అతని పేరు యాదగిరి. నిజానికి అతని కొడుకు అటెండర్‌గా మోహన్‌రావు దగ్గర చేరాడు. ముగ్గురు పిల్లలు. ఏడాదిక్రితం ఏదో తెలియని జబ్బుచేసి ఆకస్మాత్తుగా చనిపోయాడు. వయసులో ఆదుకోవాల్సిన కొడుకు చనిపోతే, అతని కుటుంబాన్ని పోషించడానికి అతని ఉద్యోగం తను చేస్తున్నాడు. క్లయింట్లను ఒకరి తరువాత ఒకరిని లాయర్‌తో మాట్లాడటానికి లోపలికి పంపడం, వాళ్ళకు టీ లు, బిస్కట్లు ఇవ్వడం, ఇంటికి సరకులు తీసుకురావడం, సాయంత్రాలు వర్షను కాపలా కాయడం, ఇదీ అతని దినచర్య. 'నా మనుమరాలు పన్నెండేళ్ళ కృష్ణవేణి వర్షమ్మను చూసుకోవడానికి వచ్చేది. కానీ ఎందుకనో శిరీషమ్మ ఒకరోజు కృష్ణవేణి రావొద్దులే అని చెప్పింది. చిన్న పిల్లలకు పనిపిల్ల ఆసరా కన్నా పెద్దవారు చూడ్డమే మంచిది. మీరొచ్చారు. శిరీషమ్మకు ఇక ఏ బెంగా వుండదు అన్నాడు.

"స్కూలుకు వెళ్ళదా నీ మనుమరాలు?" విజయ అడిగింది.

"వెళ్ళేదమ్మా, తండ్రి పోయాక మానేసింది."

"రేపటినుంచి కృష్ణవేణిని రమ్మను, పాఠాలు చెబుతాను. ఏకంగా ఏడో తరగతి పరీక్ష రాయిస్తాను".

లాకెట్ గడియారం 'కీచ్'మని మోగడంతో వాళ్ళ మాటలు ఆగిపోయాయి. విజయ కళ్ళు ఆత్రంగా వర్షను గమనించాయి. వర్ష బుక్స్ బ్యాగ్‌లో పెట్టి, హాల్లోకి వెళ్ళి టి.వి ఆన్ చేసింది. పిల్లల కార్టూన్ ఫిలిం వస్తోంది. చూస్తూ కూర్చుంది.

ఏడు గంటలు కావొచ్చింది. శిరీష కారు గేటుముందు ఆగింది. శిరీష లోపలికి రాగానే వాల్‌క్లాక్ వైపు చూసింది. ఆమె వెనకే డ్రైవర్ బ్రీఫ్‌కేసు తీసుకొచ్చి టేబుల్ మీద పెట్టాడు. "వర్ష ఏమీ విసిగించలేదు కదమ్మా" అడుగుతూ స్నానాల గదిలోకి వెళ్ళింది. స్నానం చేసి వచ్చింది. తల దువ్వుకుంటుంటే యాదగిరి టీ టేబుల్ మీద పెట్టాడు. టీ తాగుతూనే బ్రీఫ్‌కేసు తెరిచింది. బ్యాంకు నుంచి తెచ్చుకున్న పేపర్లు చదువుకుంటూ కూర్చొంది. మధ్య మధ్యలో ఏదో రాసింది ఆపేపర్ల మీద. మరో అరగంటకు మోహన్‌రావు వెంట పార్టీలతో లోనికి వచ్చాడు. యాదగిరి గబగబా కిచెన్‌లోకి వెళ్లి కప్పులు, టీ, ఫ్లాస్క్ పట్టుకెళ్ళాడు క్లయింట్స్ కోసం.

విజయ వర్షకు భోజనం తినిపించగానే, 'గుడ్‌నైట్' చెప్పి తన గదిలోకి వెళ్లి పడుకుంది.

ఓ అరగంట చూసి విజయ కూతురిని అడిగింది 'భోజనం చేద్దామా?'

"పాప తిని నిద్రపోయి వుంటుంది నువ్వూ తినమ్మా, నేను చాలాపేపర్లు చూడాల్సి వుంది. మేము పదిగంటలకు తింటాం. లేట్‌గా తినడం మాక అలవాటు" అంది.

బ్యాంకులో ఇంతసేపు పనిచేసింది చాలక, పనిని ఇంటికి తెచ్చుకుంది. నేను ప్రమోషన్ కోసం ప్రయత్నించలేదు. అదే వచ్చింది అని ఉత్తరంలో రాసింది. పలకరింపులు, ముచ్చట్లు, నవ్వులు అన్నీ మరచిపోయి గడియారాలతో పోటీ పడుతూ పనిచేస్తోంది. ప్రమోషన్ల కోసం పైరవీలు చేయడం ఎంత తప్పో, ఇట్లా గడియారాల్లా పనిచేయడం అంతే తప్పు అని మనసులో అనుకుంది విజయ. ఒక్కతే డైనింగ్ టేబుల్ ముందు కూర్చొని నాలుగు ముద్దలు కుక్కుకుంది. ఒంటరితనాన్ని భరించలేకపోయింది. పదే పదే విమల, రాజేశ్వర్, పిల్లల మాటలు గుర్తొచ్చాయి.

ఎవరి పనులు వారు చేసుకుంటుంటే, ఏపనీ లేకుండా ఒంటరిగా, ఏదో ఊపిరాడని నిర్బంధంలో ఉన్నట్లు ఉక్కిరి బిక్కిరయింది. ఇక్కడ వుండగలనా అని దిగులు పడింది విజయ.

నిశ్శబ్దంగా భోజనం ముగించి, తనకు కేటాయించిన గదిలో పడుకుంది. తను ఇక్కడికి ఎందుకొచ్చినట్టు? తను చేయాల్సిందేమిటో తెలియడంలేదు. కానీ వెలితి. ఏదో తెలియని వెలితి. జీవితంలో మొదటిసారి వెలితి తనకు ఎదురైంది. దీన్ని వదిలించుకోవడం ఎట్లా? లేక తను ఇందులో కరిగిపోతుందా? ఈ వాతావరణాన్ని తను మార్చుకోగలిగితేనే ఉంటుంది. లేకపోతే లేదు. కానీ ఎట్లా చెప్పడం అనుకుంది. తనకు తన కూతురికి మధ్య ఏదో దూరం ఏర్పడింది. మాటలు దూరాన్ని చెరిపేస్తాయి. కాని అవే మాటలు ఇప్పుడు కరువయ్యాయి. విజయ ఇట్లా ఆలోచిస్తూ ఎప్పుడో నిద్రలోకి జారిపోయింది.

విజయకు ఆ ఐదురోజులు చాలా భరువుగా, నిస్తేజంగా గడిచిపోయాయి. తను ఏమీ చేయలేకపోయింది. తన ఆలోచనల్ని కూతురికి చెప్పకునే అవకాశం కూడా ఆమెకు దొరకలేదు. వాళ్లను ఎక్కడ డిస్టర్బ్ చేస్తానోనని తనే భయపడుతోంది. మనసుకు, శరీరానికి ఏదో నీరసం ముంచెత్తుతోంది. తన పోటికి, కాళ్లకు, చేతులకు కనిపించని ఇనుప సంకెళ్లు. వాటిని మోయలేకపోతోంది. వాటిని తెంచుకోవడం ఎట్లాగో తెలియక ఆమెకు దిగులు పట్టుకుంది. ఇక తను ఇక్కడ ఎంత మాత్రమూ వుండలేదు. విమల దగ్గరకు వెళ్లాలని నిర్ణయించుకుంది విజయ. కానీ వెళ్లేముందు తన దిగుళ్ల గురించి చెప్పాలి. తప్పదు వీళ్లను డిస్టర్బ్ చేయాలి. వీళ్లూ మనుషులే. యంత్రాలు కాదు. యంత్రాలైన వారిని డిస్టర్బ్ చేయకూడదని తను దూరంగా మసులుకుంది.

" 'శరీరాలు భూమికి పూచిన నడిచేపువ్వులు' అన్నాడొక కవి. కానీ ఈ ఇంట్లో మనుషులు వాసన లేని ప్లాస్టిక్ పువ్వులు" అనుకుంది.

మిగతా 13వ పేజీలో

హాయ్‌రే హాయ్ జాంపండురేయ్

జామకాయలో ఆపిల్‌లో ఉండే అన్ని గుణాలు ఉన్నాయి. పైగా ఇది అన్ని కాలాల్లో కూడా లభిస్తుంది. జాంపండు లాటిన్ అమెరికాలో పుట్టినా భారత దేశమంతటా విరివిరిగా లభిస్తోంది. జాంపండులో విటమిన్ ఎ, బి, సి. సమృద్ధిగా ఉన్నాయి. వీటితో పాటు మనశరీరానికి ఉపయోగపడే టానిక్ అనే పదార్థం కూడా ఉంటుంది. ఒక మంచి జాంపండు 80 కేలరీల శక్తి ఇస్తుంది. ఒక పెద్దదయిన ఆపిల్‌లో కేవలం 55 కేలరీల శక్తే ఉంటుంది. జాంపండులో అనేక పోషక గుణాలతోపాటు ఔషధ గుణాలుకూడా ఉన్నాయి. జాంపండు మలబద్ధకాన్ని తొలగించి కడుపును శుభ్రం చేస్తుంది. అంతేకాక ఇది మంచి బలమైన టానిక్‌లా పనిచేస్తుంది. జాంపండు రసం గుజ్జు పాలలో కలిపి తీసుకుంటే ఎంతో మంచిది. ఈ మిశ్రమ రసం ప్రతిరోజూ ఒక గ్లాసు తీసుకుంటే మంచి ఆరోగ్యం శరీర కాంతి కలుగుతుంది. పోషక గుణాలు ఎక్కువ ఉన్న జాంపండును ప్రతిరోజూ తీసుకుంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్యం పొందవచ్చు. రోజుకొక జాంపండుతింటే డాక్టర్‌ని దూరంగా ఉంచవచ్చు.

జామ ఆకు, పువ్వుకి కూడా ఔషధ గుణం ఉంది. జామఆకులు నూరి గాయాల మీద వేసికట్టుకడితే గాయాలు త్వరగా మానిపోతాయి. జామ పువ్వుల రసాన్ని నుదురుకురాస్తే తలనొప్పి వెంటనే తగ్గుతుంది. జామ పువ్వుల నీరు రెండు చెంచాలు, తేనె ఒకచెంచాతో కలిపి తీసుకుంటే కొంతకాలానికి సన్నబడతారు.

-కె. ఆర్కే. మూర్తి

వెన్నపండు

జామకాయలానూ, మామిడికాయలానూ కనిపించే ఈ పండుని బటర్‌ఫ్రూట్ అంటారు. అతి శీతల ప్రదేశాల్లో మాత్రమే ఈ చెట్లు పెరుగుతాయి. కొడైకెనాల్ కొండ మీద విస్తారంగా పండుతాయి. ఆకు పచ్చని రంగులోని ఈ పండు మగ్గి కొంచెం మెత్తబడ్డాక అడ్డంగా రెండ సగాలుగా కోస్తారు. మామిడి ముట్టెలాగా ఉండే విత్తనాన్ని తీసేస్తే రెండు సగాలూ రెండూ గిన్నెల్లా తయారవుతాయి. ఒక స్పూన్ చక్కర అందులో వేసుకుని స్పూన్‌తో కలిపితే పండులోని తెల్లని గుజ్జూ, చక్కెర కలగలిపి పోతుంది. బటర్‌ఫ్రూట్ తోలుగట్టిగా వుంటుంది. గనుక గిన్నెలా ఉండిపోతుంది. స్పూన్‌తో వెన్నలా జిడ్డుగా ఉండే గుజ్జును తింటే భలేరుచిగా ఉంటుంది. చలిప్రదేశాల్లో ఐస్‌క్రీంలాగే ఉంటుంది ఇది. వెన్నా నెయ్యీ ఎంతో యిష్టమైనా గుండెజబ్బు భయంతో వీటికి దూరంగా ఉండేవారు ప్రియంగా తినొచ్చు దీన్ని. పండులో కొవ్వు పదార్థం ఉంటుంది. గానీ కొలెస్ట్రాల్ ఉండదు. గుండెకు ప్రమాద కారి క్లొలెస్ట్రాలే కదా. ఈ పండులో ఇంకా ఎ, బి1, బి2, బి3, బి6, ఇ విటమిన్‌ల కూడా ఉంటాయి. మహామజాగా ఉండే బటర్‌ఫ్రూట్ ఉష్ణప్రదేశాల్లో దొరక్కపోవడమే విచారం. కానీ మీరు ఊటికో, కొడైకెనాల్‌లో వెళ్తే మాత్రం రోడ్డు పక్కన బండ్లమీద దొరికే ఈ వెన్నపండుని తినకుండా రావద్దు.

ప్లాస్టిక్ పువ్వులు (కథ)

12వ పేజీ తరువాయి

ఆరోజు ఎప్పటిలాగే సాయంత్రం ఏడు గంటలకు వచ్చింది శిరీష. లోపలికి రాగానే తన కూతురివైపో, తల్లివైపో చూడలేదు. ముందు వాల్‌క్లాక్ వైపే చూసింది. 'వర్ష ఏమీ విసిగించలేదు కదమ్మా' అని అడిగి స్నానానికి వెళ్లింది.

ఆమె బయటికి రాగానే యాదగిరి ఆమె రోజూ కూర్చునే టేబుల్‌మీద టీకప్పు పెట్టాడు. టీకన్నా ముందే బ్రీఫ్‌కేస్ తెరిచింది. టేబుల్ మీద పేపర్లు పరిచి, అప్పుడు టీ తీసుకుంది. ఓ అరగంట వేచిచూసి, విజయ కూతురిని అడిగింది "భోజనం చేద్దామా?"

"నువ్వు తినమ్మా, మేము తరువాత తింటాం" అంది పేపర్లోంచి తల ఎత్తకుండానే శిరీష.

"బ్యాంకులో, ఇంట్లో బ్యాంకు పనిచేస్తూ ప్రమోషన్ తెచ్చుకున్నావు. పైరవీలతో ప్రమోషన్లు తెచ్చుకోవడం ఎంత తప్పో, నీ చుట్టూ మనుషులను మరిచిపోయి కెరీర్ కోసం ఇంత శ్రమపడడమూ తప్పే" అంది విజయ.

శిరీష వెంటనే పేపర్లు బ్రీఫ్‌కేస్‌లో పెట్టి భోజనానికి లేచింది. మోహన్‌రావును భోజనానికి రమ్మనమని యాదగిరికి చెప్పి శిరీష డైనింగ్ హాలులోకి కదిలింది. శిరీష అట్లా వెంటనే తన మాట వినడం చూసి ఆశ్చర్యపోయింది విజయ. తను అనుకున్న విషయాలన్నీ చెప్పేయాలి అనుకుంది.

"పగలంతా పాప, నేను ఎట్లా గడిపామో అడగొచ్చు. ఇంటికి ఇంకా పెందరాళే రావొచ్చు. మీకు పని జబ్బు పట్టుకుంది. మనం సాయంత్రాన్ని ఎంత ఆనందంగా గడిపేవాళ్లం. ఉదయాలు, సాయంత్రాలు లేకుండా ఏమిటమ్మా ఇంతపని. వర్ష మెళ్లో ఓ గడియారం వేసి, అప్పుడే ఓ గడియారాన్ని చేసేశారు" డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంటూ అంది విజయ.

"ఏం చేయను, యాదగిరి మనమరాలు వచ్చేది. ఆ పిల్లకు ఏమీ తెలిసేదికాదు. వర్షకు ఒకటి, రెండుసార్లు చెప్పగానే లాకెట్ గడియారానికి అలవాటుపడిపోయింది. ఏ పేచీ పెట్టదు"

"వర్షకు ఆటలు, పాటలు, కేరింతలు, పేచీలు తెలిస్తేకదా! అవి లేకుండానే పెరుగుతోంది. ఇంతకూ యాదగిరి మనుమ రాల్ని ఎందుకు మాన్పించావు? "ఈమధ్య ఇంగ్లాండులో, అమెరికాలో జరిగిన సంఘటనల గురించి టీవీలో న్యూస్ చూసే వుంటావు. పని పిల్లలు, చిన్న పిల్లల్ని ఆడించలేక చంపేశారు. భయమేసి కృష్ణవేణిని మాన్పించేశాను. నువ్వు మొదట్నుంచి అడుగుతున్నావు పాపను చూసుకుంటానని, నేనుకూడా అమ్మమ్మదగ్గరే పెరిగాను, అందుకే నిన్ను రమ్మన్నాను".

"పనిపిల్లలైనా పిల్లలేకదా! ఆడుకోవాల్సిన పిల్లలు అమ్మలైపోవాలంటే ఎంత కష్టం. పిల్లలను అమ్మలనుచేసి, వారిని నేరస్తులను చేసే పెద్దవాళ్లది తప్పకాని, పిల్లలది ఎట్లా అవుతుంది? కృష్ణవేణిని రమ్మన్నాను. ఏడో తరగతి పరీక్ష రాయిస్తాను. ఇద్దరు కలిసి ఆడుకుంటారు. నాకూ కాలక్షేపం అవుతుంది".

భోజనం ముగించి శిరీష వర్ష గదిలోకి వెళ్లింది. 'వర్షతో గడపడానికి కూడా టైం



లేకుండా చేసుకుంది. రాత్రి మాత్రమే నిద్రపోతున్న వర్షను చూసుకొంటోంది. పాపం!' అనుకుంది. రేపట్నుంచి బ్యాంకు నుంచి తొందరగా రమ్మని ఒకటికి రెండు సార్లు గుర్తుచేయాలి అనుకుంటూ తనూ వర్ష రూంలోకి వెళ్లింది.

శిరీష వర్ష పక్కన లేదు. వర్ష బుక్స్ బ్యాగ్ మీద పెట్టిన నోట్‌బుక్‌ను పరిశీలనగా చూస్తోంది శిరీష.

"ఏమిటి శిరీష, ఏం రాసింది వర్ష" అనుకుంటూ దగ్గరికి వెళ్లింది విజయ.

"వర్ష ఏ టైంలో ఏ వర్క్ చేసుకుందో రాసిపెడుతుంది. అది చూస్తున్నాను"

విజయకు అర్థంకాలేదు ముందు. నోట్ బుక్‌లోకి తొంగిచూసి, 'పాపతో మాటలు, ఆటలు లేకుండా కేవలం ఏ టైంకు, ఏం చేసిందో తెలుసుకుని ఇన్నాళ్లు తృప్తిపడిందా శిరీష!' అనుకొని విజయ భయంతో వణికిపోయింది. ఆమె కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి. "బుక్స్, టైంపీస్, పెన్సిల్స్, షార్పనర్స్, ఎరేజర్స్ మధ్య పెరుగుతోంది వర్ష. పాపకు బాల్యం లేదు. అమ్మా నాన్నల ప్రేమా లేదు. ఇదేమి జీవితం శిరీష!" కొంగుతో తుడుచుకుంటూ అంది.

నేరస్థురాలిగా, అసహాయంగా నిలుచుండిపోయింది శిరీష. విజయ వర్ష మెళ్లోని లాకెట్ తీసేసింది. ఈ రోజు నుంచి వర్ష నా దగ్గరే పడుకుంటుంది. "మీ అమ్మమ్మలాగా నేనూ వర్షను చూసుకుంటాను".

శిరీష తల్లి మాటలకు ముగ్ధురాలయింది. తల్లిని పెనవేసుకొని, ఆమె భుజంపై వాలిపోయింది తప్పు చేసినట్టు.

విజయ కూతురి తలను ఆప్యాయంగా నిమురుతూ అంది, "ప్రేమలు, ఆపేక్షలు, మమకారాలు లేకపోతే మనకూ ప్లాస్టిక్ పువ్వులకు తేడా ఏమిటి? పరిస్థితులకు బందీలయిపోవద్దు. ఎల్లప్పుడు మనసుల్లో మమతానురాగాల పరిమళాలు కాపాడుకోవాలి". ●

వచ్చేవారం కథ

అజాగళ స్తనాలు

-వివినమూర్తి

ఇలా చేస్తే సరి



* దంతాలు పసుపుపచ్చగా వుంటే ఉప్పుతో పళ్ళు తోముకుంటే సరి.



* స్నానం చేసే నీటిలో చిన్న కప్పు పాలపొడి వేసి కలిపి స్నానం చేస్తే చర్మం మెత్తపడి అందంగా వుంటుంది.

* వెండి పాత్రలు కడిగే నీటిలో కాస్త పాలు కలిపి కడిగితే పాత్రలు తళతళలాడుతాయి.

* తేనెటీగ కుట్టినచోట ఉల్లిరసం రాస్తే బాధ తగ్గిపోతుంది.

-ఎన్. శివానంద్